# మా బాబాయ్ సజ్జనుడే!

హాస్యకథ

– సతీష్ చందర్

వార ఫలాల్లేని వార పత్రికుండొచ్చు. మా బాబాయి సీరియల్ లేని వారపత్రిక వుండదు.

మా బాబాయి సృష్టించిన పాత్రలు పాఠకుల పీకల మీద కూర్చుంటాయి. ఏదయినా ఒక వారం మా బాబాయి తన సీరియల్లో హీరోయిన్‌ని వదలి పెట్టించి హీరోని అలా అవారాలా రోడ్లమీద తిప్పాడనుకోండి! పాఠకుల పరిస్థితి చూడాలి. హీరోయిన్ విరహాన్ని తమ విరహంగా భావించి, ఆఫీసుల్లో ఫైళ్ళు మూసేసి సుదీర్ఘంగా ఆలోచిస్తూ వుంటారు.

నిజం చెప్పొద్దూ. నా పరిస్థితి అంతకన్నా అధ్వాన్నం. బాబాయి సీరియల్ చదివితే నాకు అన్నమే కాదు. దొంగచాటుగా కాల్చే సిగరెట్టు కూడా సయించదు.

ఒకసారిగా కొత్తగా మార్కెట్లోకి వచ్చిన వారపత్రిక అమాంతంగా వచ్చే 'సరుకు'లేషన్ వాపు కోసం మా బాబాయి సీరియల్‌ని మొదలుపెట్టింది. సీరియల్ పేరు 'అగెలా జరుగుతుంది' మొదటి భాగం చదివేసరికి నాకు ముచ్చెమట్లు పోశాయి (అలా చదివించే పద్ధతినే 'రీడబిలిటీ' అంటారని తర్వాత చెప్పాడు బాబాయ్). పద్నాలుగేళ్ళ అమ్మాయీ, పదహారేళ్ళబ్బాయి కలిసి పిల్లలెలా పుడతారో తెలుసుకోవాలనుకుంటారు. హాస్పటల్ 'లేబర్ రూమ్' తలుపు సందుల్లోంచి ఒక ప్రసవాన్ని చూస్తారు.

"అసలు ఆ బిడ్డ అక్కడికెలా వచ్చాడు?' - పదహారేళ్ళ కుర్రాడికి సందేహం వచ్చింది.

ఈ సారి వాళ్ళిద్దరూ మరోగది దగ్గరకు వెళ్ళారు. ఆగదిలో ప్రసవం కాదు. మరింకేదో జరుగుతోంది" ఇలా అర్థాంతరంగా మొదటి భాగాన్ని ఆపుచేశాడు.

సరిగ్గా అప్పటికి నా వయసు పదహారేళ్ళే. కాని నాకో పద్నాలుగేళ్ళ 'గాళ్ ఫ్రెండ్' లేదు. ప్రాణం చివుక్కుమంది. ఇంకో గదిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలంటే వారం ఆగాల. చాలా కష్టం. ఆ క్షణం నుంచీ తలుపులు మూసి వున్నగది కనిపిస్తే చాలు కాళ్ళు అక్కడికి వెళ్ళిపోతున్నాయ్. ఈ పరిస్థితి ప్రమాదానికి దారితీస్తుందోనని బయపడేవాణ్ణి. చదివిన రోజు సాయంత్రం వరకూ యిదే పరిస్థితి.

సాయంత్రం ట్యూషన్‌కి వెళ్ళాను. మాస్టారింటికి తలుపులు మూసి వున్నాయి. కాలింగ్ బెల్ నొక్కకుండా తలుపుసందుల్లోంచి చూస్తున్నాను. వెనకనించెవరో వీపుమీద ఒక్కటిచ్చుకున్నారు.



ఎవరూ? చూస్తే ఆశ్చర్యం. మాస్టారి పక్కింటి అమ్మాయే. తొమ్మిదో తరగతి చదువుతోంది. మా చెల్లెలు క్లాస్‌మేట్.

"మాస్టారు ఫ్యామిలీతో ఊరెళ్తానని చెప్పారు. మరిచిపోయావా?" అంది పగలబడి నవ్వుతూ.

ఆ అమ్మాయి చెప్పింది నాకు వినిపించలేదు. ఈ అమ్మాయికి పద్నాలుగేళ్ళు వుండొచ్చు. సీరియల్లాగే ఆమె ముక్కు కింద కూడా చెమట బొట్లు కనిపిస్తున్నాయి.

"పిల్లలెలా పుడతారో నీకు తెలుసా?" అడిగేశాను.

"ఆ టాపిక్ మీద మాస్టారు కాంపోజిషన్ రాయిస్తానన్నారా? అయ్యో పాపం! అయినా మాస్టారు రావడానికి యింకా వారం రోజులుంది. ప్రిపేర్ కావచ్చులే. అప్పుడే భయమెందుకూ" అనేసి వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయి తెలివి తక్కువతనానికి తిట్టుకున్నాను "నిజంగా బాబాయి సీరియల్స్ చదవని వాళ్లు ఎంత వెనకబడిపోతున్నారు" అని జాలిపడ్డాను కూడా.

ఇంటికొచ్చానన్న మాటే కాని ఆ రాత్రి నిద్ర పట్టలేదు. 'మరో గదిలో ఏం జరగబోతోంది' అంతు పట్టట్లేదు. చివరికెలాగో కునుకు పట్టిందంటే పీడకలలు- ఒకదాని తర్వాత ఒకటి సీరియల్‌గా. అన్ని కలల్లోనూ మాస్టారి పక్కింటి అమ్మాయే. తెల్లవారు ఝామున వచ్చిన చిట్టచివర సీరియల్ పీడకలలో - ఆమెనేమన్నానో తెలీదు కాని, 'ఫాట్' మని చెంపమీద ఒక్కటిచ్చుకుంది. లేచి కూర్చున్నాను. సమయం మూడయ్యింది.

మూడు ఆరయినా, ఆరు మూడయినా మరో గదిలో ఏం జరగనున్నదో తెలుసుకోవాలి. ఈ రహస్యం తెలిసినవాడు బాబాయి ఒక్కడే. బాబాయి రాసింది పత్రికలో చదువుకోవాలంటే ఇంకా ఆరు రోజులు ఆగాలి. అప్పటి వరకూ ఆగితే నా మెదడులోని నాళాలు చిట్లిపోతాయ్.

వెంటనే హైద్రాబాద్ ప్రయాణం కట్టి బాబాయి దగ్గరకి వెళ్ళిపోవాలి. ఇప్పటికిప్పుడు ప్రయాణమంటే నాన్న డబ్బులిస్తారా? వెంటనే మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

నేను కూర్చున్న మంచం మీదనే ముసుగు తన్ని పెట్టి పడుకున్నాను. రెండు నిమిషాలాగి, కళ్ళు మూసుకుని ఏడుపందుకున్నాను.

"బాబాయ్! వెళ్ళిపోయావా బాబాయ్! తెలుగు సీరియల్ పాఠకుల్ని ఏకాకుల్ని చేసి వెళ్ళి పోయావా బాబాయ్! వెళ్ళిపోయావా? నీ బతుకు అర్థాంతరంగా ముగిసిపోయిన సీరియల్ అనుకోలేదు బాబాయ్! బాబాయ్! పేలిపోయే కథలన్నీ బుర్రలోనే పెట్టుకుని వెళ్ళిపోయావా బాబాయ్, వెళ్ళిపోయా........"

మధ్యలో అమ్మా,నాన్నా వచ్చి ఆపేశారు.

"నాయనా పాశం! (నా పూర్తి పేరు పార్వతీశం లెండి). ఏమయిందిరా! ఏదయినా పీడకల వచ్చిందా" అంది అమ్మ నన్ను దగ్గరకి తీసుకుంటూ.

"బాబాయ్ చచ్చిపోయాడమ్మా! నిజం ముఖం కూడా కనిపించకుండా శవం మీద సీరియల్ నవల్లు పేర్చేసారమ్మా! నీకు తెలుసామ్మా. లక్షలాది పాఠకులు బాబాయ్ శవాన్ని చూసి విలపిస్తుంటే, పిన్ని మాత్రం ఒక్క కన్నీటి చుక్క కూడా విడవలేదమ్మా!"

అమ్మకు పిన్నంటే పడదనే ఆ ముక్క కూడా చేర్చాను.

"చూశారా! మీ మరదలు ఎంత కఠినాత్మురాలో!" నాన్నకు ఫిర్యాదు చేసింది అమ్మ

"ఏరా! నిజమేనట్రా?" నాన్న ఆరా తీసారు.

"నా పీడకల మీద ఒట్టు నాన్నా! నాన్నా బాబాయ్ కెలా వుందో? బాబాయ్ దగ్గరికి వెళ్ళొస్తా నాన్నా. బెంగగా వుంది" అన్నాను. అంతే అమ్మా నాన్నా ఒప్పేసుకుని రానూపోనూ డబ్బులిచ్చేశారు.

* * *

స్నానం చేసి, పిన్ని పెట్టిన భోజనం పూర్తి చేసి కూర్చున్నాను. ఎంత సేపు చూసినా 'బాబాయ్' అనే పాత్ర ప్రత్యక్షం కాలేదు. రాత్రి తొమ్మిదయింది. ఇక ఉండబట్టలేక అడిగేశాను. "పిన్నీ! బాబాయ్ అసలు ఎక్కడికెళ్ళాడు" అని.

విసుగ్గా ముఖం పెట్టుకుని "మేడ గదిలో చచ్చాడు" అని కసురుకుంది.

నా గుండెలు ఝల్లుమన్నాయి. "నా కల నిజం కాలేదు కదా!" అనుకున్నాను. అయినా అది తెచ్చుకున్న కలకాని, వచ్చిన కల కాదు. అందుచేత నన్ను నేనే సముదాయించుకున్నాను. అయినా 'మరోగదిలో' ఏం జరుగుతోందో నాకు చెప్పకుండా చచ్చిపోవడం పరమదారుణం అవుతుంది. అలాంటి దారుణాలను నేను ఊహించుకోలేను.

మెల్లిగా మెట్లెక్కి మేడగది దగ్గరకు వెళ్ళాను. లోపల లైట్లు వెలుగుతున్నాయి అయినా తలుపులు మూసి వున్నాయి. "ఆ మరో గది యిది కాదు కదా!" అనుకుంటూ తలుపు సందుల్లోంచి చూశాను. బాబాయి నిక్షేపంలా వున్నాడు.

బాబాయీ, మెడలో టై వేళ్ళాడుతున్న మరో వ్యక్తి వున్నారు. మధ్యన టీపాయ్ వుంది. కింద సరిగ్గా నా వయసున్న కుర్రాడు పరీక్ష వ్రాస్తున్నట్టు పాడ్, పేపర్లు పెట్టుకొని ఏదో రాస్తున్నాడు.

తలుపు కొట్టాను. కుర్రాడొచ్చి తలుపు తీశాడు.

"ఏరా పాశం!" రా.రా. ఎప్పుడొచ్చావ్? అమ్మా నాన్నా కులాసాయేనా?" ఏవీ సమాధాన్నాశించే ప్రశ్నలు కావు. అయినా బదులిస్తూ వాళ్ళు చేస్తున్న పని చూశాను. విస్కీలాంటిదేదో తాగుతున్నారు. బాబాయ్ విస్కీ గ్లాసు పట్టుకున్న తీరు ఠీవిగా వుంది. అచ్చు సీరియల్‌లో హీరోలా పట్టుకున్నాడు.

'వన్ మినిట్' అని నాతో చెప్పి నెక్‌టై కట్టుకున్న మనిషితో సంభాషణ కొనసాగించాడు. నేను నా వయసు కుర్రాడి పక్కన చతికిల పడ్డాను.

"మీరు తయారు చేస్తున్న కండోమ్స్ ఏ ఏజ్ గ్రూప్ వాళ్ళు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు?

నాకది కావాలి?" బాబాయ్ ఆ నెక్‌టై మనిషిని నిలదీశాడు.

నాకు 'కండోమ్' అంటే అర్థం కాలేదు. నా పక్కనున్న నా వయసు కుర్రాణ్ణడిగాను మెల్లిగా. వాడు నాకర్థమయ్యేట్టు చెప్పాడు.

ఇంతకుముందు మా మాస్టారి పక్కింటమ్మాయి అజ్ఞానానికి జాలి పడ్డానన్నాను కదా. ఇప్పుడు మాత్రం నా వెనకబాటు



"అయ్యో! మీది ఏదో కాయితం క్రింద పడిపోయిందండీ!" అంటూ శంకరం జాగ్రత్తగా ఆ కాయితాన్ని ఆమెకు అందించాడు.

సూర్యకుమారి పెదిమలు సున్నలా చుట్టి - "మీరు ఆ కాయితాన్ని చదివారా!" అంది.

"హబ్బే!" అన్నాడు.

"హూ!" అని విట్టూర్చి ఆ కాయితాన్ని పుస్తకంలో దాచి ఈ వెర్రి వెధవకి ప్రేమ సిగ్నల్స్ తెలియవన్నమాట గొణుక్కుంటూ అక్కడ్నించి కదిలింది.

తవానికి నేనే జాలి పడ్డాను. అంతెకాదు ఆకుర్రాడి మీద ఈర్ష్య పడ్డాను.

"టీనేజర్స్ - ఐమీన్ థర్టీన్ అండ్ నైన్‌టీన్ వయసువాళ్ళు మా కండోమ్స్‌ని ఎక్కువగా ఉపయోగిస్తారు" నెక్‌టై మనిషి చెప్పాడు.

"క్వయిట్ సర్‌ప్రయిజింగ్, పెళ్ళయ్యి, ఇంక పిల్లలు అక్కర్లేదనుకున్న మగాళ్ళు ఉపయోగించాల్సిన కండోమ్స్‌ని పిల్లలు ఉపయోగిస్తున్నారా?" బాబాయ్ ఆశ్చర్యంలో మందు కొట్టడం మరచిపోయాడు.

"విత్ ఆల్ యువర్ బ్లెసింగ్స్. అంతా మీ చలవే. పిల్లల లైంగికావసరాలను గుర్తించి మీరు రాస్తున్న నవలలు మా మార్కెట్‌ని మరింత పెంచుతున్నాయి. అదీకాక ఒంటిమీద బట్టనిలవని కాజామోడీ అనే స్టన్నింగ్ బ్యూటీ మా కండోమ్స్‌కి మోడల్‌గా వుండటంవల్ల కూడా మా సేల్స్ పెరిగాయి."

"చాలు. దట్సెనఫ్. ఇన్వెస్టిగేషన్ ఓవర్. ఇక చూడండి నాకొత్త సీరియల్ 'అదెలా జరుగుతుంది'ని ఎన్ని మలుపులు తిప్పుతానో?"

అలా అన్నాడో లేదో నా వయసు కుర్రాడు రాయడం ఆపేశాడు.

బాబాయ్‌ని అప్పుడే అడిగేద్దామనుకున్నాను - 'నీ మలుపులు తర్వాత. ముందు వచ్చే వారం మలుపు చెప్పు. మరో గదిలో వాళ్ళేంచేస్తారు?' అని. ఇంతలో ఓ చిన్న ఆలోచన. నా వయసు కుర్రాణ్ణే అడిగేస్తే!?

వాణ్ణి మెల్లిగా గది బయటకు తీసుకెళ్ళాను.

"ఇదుగో చూడు బాబూ!" అన్నానో లేదో వాడికి కోపం దూసుకువచ్చింది. "బాబూ ఏమిటి? చిన్న పిల్లాణ్ణి పిలిచినట్టు. నన్ను 'ఘోస్ట్' అనాలి తెలిసిందా?" అన్నాడు.

"ఘోస్టు అంటే దయ్యం పేరేమో?" అన్నాను.

"కాదు. ఘోస్ట్ అంటే ఘోస్ట్ రైటర్ అసలు రచయిత అని. నేను రాసిందే మీ బాబాయి పేరు మీద అచ్చవుతుంది" అన్నాడు. నా అజ్ఞానానికి సిగ్గుపడడం కాదు. మేడమీదనుంచి దూకేద్దామనిపించింది. కాని మరో గదిలో ఏమవుతుందో సస్పన్స్ తెలుసుకోకుండా చచ్చిపోవడం నాకిష్టం లేదు.

"ఇదిగో ఘోస్టూ. సూటిగా చెప్పు. వచ్చేవారం మరోగదిలో ఏం జరుగుతుందీ?" అడిగేశాను.

"ఓస్ యింతేనా? రేపు చెప్తాను"

"ఇప్పుడు చెప్పలేవా?"

"మీ బాబాయి నడగాలి"

"నువ్వే రాస్తానన్నావ్?"

"నేనే రాస్తాను. కాని ఏ పార్టులో ఏ ట్విస్ట్ యివ్వాలో మీ బాబాయి చెప్పాలి"

"ట్విస్ట్ అంటే?"

"పాఠకుణ్ణి వారంపాటు ఊరించడం. నిద్రలేకుండా చెయ్యడం"

ఈలోగా మా బాబాయి ఆ ఘోస్టుగాణ్ణి పిలిచేశాడు. నన్ను కిందకి వెళ్ళి నిద్రపొమ్మన్నాడు.

ఆ రాత్రి మళ్ళీ పీడకలలు. నేను కూడా రచయితనైనట్లు. సస్పెన్స్ తట్టుకోలేని పాఠకులు తరుముకొస్తున్నట్లు. రాత్రంతా భయం భయంగా గడిచింది. పొద్దున్నే కాలకృత్యాలన్నీ ముగించుకొని మేడగదిలోకి పరుగెత్తాను.

నా వయసు కుర్రాడిలాంటి ఘోస్టులు చాలామంది వున్నారు. రాత్రి బార్‌లా వున్న గది తెల్లారేసరికి ఆఫీసులా మారిపోయింది. బాబాయి ఆఫీసర్‌లా పెద్ద టేబుల్ దగ్గర కాళ్ళు తన్ని పెట్టుకుని కూర్చున్నారు. టేబుల్ మీద ఇంగ్లీషు నవలలు దొంతర దొంతరులుగా పడి వున్నాయి.

ముందు గుబురు గడ్డం వున్న పెద్ద ఘోస్టుని పిలిచాడు బాబాయి.

"నీ కథేమిటి ముసలి మొగుడు - పడుచు ప్రియుడు అదే కదా. ఎన్ని ఎపిసోడ్స్ వచ్చింది యింతవరకూ?"

"పది సార్"

"ఓస్ అంతేనా. ఇంకా బోలెడంత సాగదీయొచ్చు. ఒక్కో ఎపిసోడ్‌లో ఒక్కో రాత్రి గురించి కదా మనం రాస్తున్నాం ఆ అమ్మాయి లాస్ట్ ఎపిసోడ్‌లో ఎవరితో వుంది? ముసలాయన్తో కదా! ట్విస్ట్ ఎలా యిచ్చాం చదువు"

"కుర్రాడు బైనాక్యులర్స్‌తో చూస్తూనే వున్నాడు. ఆమె ఒంటిమీదనున్న వస్త్రాలన్నీ వలిచేస్తోంది. ఎదురుగా వృద్ధుడు. చివరి వస్త్రం తియ్యాలంతే. ఈ లోగా కరెంటు పోయింది. కుర్రాడు కోపంతో బైనాక్యులర్స్ నేలకేసి కొట్టాడు. అంతేసార్"

"గుడ్. ఈసారి ఎపిసోడ్ కుర్రాడిమీద. చివరి వరకూ నీ యిష్టం వచ్చినట్టురాయి. పాఠకులు వెర్రెత్తిపోవాలి. చివర్లో మాత్రం యిలా వుండాలి" అని టేబుల్ మీద ఇంగ్లీషు నవల్లో మడత పెట్టిన పేజీ తీశాడు.

"కమాన్, టేక్ డౌన్. విస్కీ మొత్తం ఖాళీ అయ్యింది. ఆ యువకుడు ఆమె గౌన్ బటన్స్ విప్పుతున్నాడు......" "సార్. ఇక్కడ విప్పాల్సింది జాకెట్ హుక్స్ కదా"

"నాన్సెన్స్. ఆ మాత్రం నువ్వు మార్చుకోలేవు? హుక్స్ విప్పాక కాస్త వర్ణించు. ఆ తర్వాత రాసుకో, అతడు ఆమె భుజం మీద చేతులు వేస్తాడు. ఈ లోగా కాలింగ్ బెల్ మోగుతుంది. వచ్చింది ముసలి మొగుడేనా? - అంతే చాలు" చాలా అవలీలగా చెప్పేశాడు. అరవీసం జ్ఞానమేదో నాకు ఆయాచితంగా అబ్బినట్టనిపించింది.

రెండో ఘోస్టుని పిలిచాడు. ఈ సారి ఆడ ఘోస్టు వచ్చింది.

"ఏ అమ్మా నీ సీరియల్ ఏమిటి? 'టక్-టక్-టక్' కదా! రెండు భాగాలు రాశాం. మూడో భాగం రాయాలి. ఒక్కోసారి ఒక్కోడోర్ టక్-టక్-టక్ మంటుంది. మొదటివారం బాత్‌రూమ్ డోర్, రెండో వారం స్టోర్ రూం డోర్. అంతే కదా! రెండోవారం ట్విస్ట్ చదువు."

"స్టోర్ రూములో ప్రియుణ్ణి రెండో రాత్రి కూడా ముచ్చటగా దాచేసి తెల్లవారు ఝామున పంపించెయ్యాలనుకుంది. ఈ లోగా టక్-టక్-టక్. తలుపు చప్పుడు. ఏం చెయ్యాలో తోచక, డబ్బాలో వున్న బొంబాయి రవ్వంతా ప్రియుడి మీద వంపింది. ఆతర్వాత తలుపు తీసింది. వచ్చింది భర్తే. కాని ఏం లాభం? బొంబాయి రవ్వలో తెల్లగా వున్న ప్రియుణ్ణి దయ్యమనుకుని కెవ్వుమని కేకపెట్టాడు" అని చిన్నగా నవ్వింది ఆడ ఘోస్టు.

"పిండి కొద్దీ ప్రియుడు - అంటే అంతే మరి" అంటూ మరో ఇంగ్లీషు నవల తిరగవేశాడు.

"ఒరేయ్ రామూ! హిమాలయ పర్వతాలు ఎక్కడున్నాయిరా?"

"నాకు తెలియదు సార్"

"అమ్మ వెధవ! మొన్న నోరుపడిపోయేటట్టు చెప్పాను కదరా! - బల్ల ఎక్కి నిలబడరా"

రాము బల్ల ఎక్కి తిరిగి అన్నాడు-

"టీచర్! బల్ల ఎక్కినాకూడా కనపడ లేదు"

--శర్మ



"మూడోవారం మూడోరాత్రి రాయాలి కదా. ఈ సారి ప్రణయం కారులో జరుపు. చివరిలో కారుషెడ్ షట్టర్ టక్-టక్-టక్ మంటుంది. ఇద్దరూ కప్పుకున్న ఉన్ని బ్లాంకెట్ తీసి చూస్తుంది"

"సార్. వేసవి రాత్రుల్లో కదా మనం కథ నడుపుతున్నది. ఉన్ని....."

"దానిదేముంది ఆ ఒక్కరోజూ వర్షం కురిసినట్టు రాయి. బైదిబై మధ్యలో వాళ్ళి ద్దర్నీ షెడ్డులోంచి బయటకు తీసికొచ్చి కాస్త తడుపు. చివరికి మాత్రం చప్పుడు రాగానే ఆమె షట్టర్స్ లిఫ్ట్ చేస్తుంది. తప్ప తాగి తూలుతున్న తన భర్త. సారీ! ఇది మా యిల్లనుకున్నాను" అని వెళ్ళిపోబోయి వెనక్కి తిరిగి పరికించి చూస్తాడు"

ఆ అమ్మాయి నవ్వుకుంటూనే నోట్సు తీసుకొని వెళ్ళిపోయింది. నాకు జ్ఞానం రెండితలయ్యింది. నాకిప్పుడు 'మరో గదిలో 'ఏమౌతుంది' అన్నది పెద్దగా బాధించడం లేదు.

"లెటర్స్ ప్లీజ్" అని బాబాయి అరవి సిగరెట్ వెలిగించుకున్నాడు. పాఠకుల ప్రశ్నలకు బాబాయ్ సమాధానాలు చెపుతాడన్న మాట. బాబ్డ్ హెయిర్ వున్న అమ్మాయెవరో వచ్చి చదివింది.

"సార్! మీకు పెళ్ళయిపోయింది కాని లేకపోతే ఎమ్మల్నే ప్రేమించేదాన్ని"

"ఏమిటి నువ్వా?" బాబాయ్ సరదాగా ఉలిక్కిపడ్డాడు

"కాదు ఆముదాల వలస నుంచి ఎవరో అమ్మాయి రాసింది. పేరు రాయలేదు అందామె.

"ప్రేమకు పెళ్ళి హద్దుకాదు. ముగింపు కాదు. అయినా ప్రస్తుతానికి నా హృదయంలో నో వేకెన్సీ. ఏడాదిలో ఖాళీలేర్పడవచ్చు."

"నెక్స్టట్ క్వశ్చన్ సార్. ఇంత గొప్ప రచనలన్నీ మీరెప్పుడు చేస్తుంటారు"

"ఎప్పుడు బడితే అప్పుడు. అయితే రాత్రిళ్ళు ఎక్కువ రాస్తాను. మధ్యలో ఒక గంట విరామం"

"మూడ్ లేకుండా రచనలు చెయ్యొచ్చా"

"రచన అంటే విసర్జించడమే. దానికి మూడ్‌తో పనిలేదు" అని లెటర్స్ ముగించాడు. మిగిలిన ప్రశ్నలకి సమాధానాల్ని ఘోస్ట్‌లనే రాసుకోమన్నాడు.

మళ్ళీ ఇద్దరి ఘోస్ట్‌లని పిలిచాడు గుండె గుభేలుమనే ట్విస్ట్ లిచ్చాడు. నాకు సరిపడినంత జ్ఞానం వచ్చేసింది. అయిదో ఘోస్ట్ అయిన నా వయసు కుర్రాణ్ణి పిలిచాడు బాబాయ్. వాడు నా వైపు చూస్తూ నవ్వుకుంటూ వచ్చాడు.

"నీది కొత్త సీరియల్ 'అదెలా జరుగుతుంది' కదూ. ఫస్ట్ ఎపిసోడ్ ట్విస్ట్ ఏమిటో చదువు"

"ఈసారి వాళ్ళిద్దరూ మరోగది దగ్గరకు వెళ్ళారు. ఆ గదిలో ప్రసవం కాదు. మరింకేదో జరుగుతోంది" ఆకుర్రాడు చదివాడు.

"కమాన్ టేక్‌డౌన్. రెండో ఎపిసోడ్ ట్విస్ట్ చెబుతాను" అన్నాడు బాబాయ్.

"బాబాయ్! ఆ ట్విస్ట్ నేను చెప్పొచ్చా?" అన్నాను.

అదిరిపోయాడు బాబాయ్

"నువ్వా!?" అన్నాడు కాలుస్తున్న సిగరెట్టు కింద పారేసుకుని. మిగతా ఘోస్టులంతా నావైపు సిలువుగుడ్లు వేసుకొని చూస్తున్నారు. నా వయసు కుర్రాడు నోరు తెరచి చూస్తున్నాడు.

"టేక్ డౌన్. ఆ గదిలో కొత్తగా పెళ్ళయిన జంట. లైట్లు వేసే వుంటాయి. నీ యిష్టం వచ్చినట్టు రాసుకో. లోపల ఏం జరుగుచున్నది చూస్తున్నది యిద్దరే యిద్దరు. పదహారేళ్ళ అబ్బాయి. పద్నాలుగేళ్ళ అమ్మాయి. అంతే కదా. చివరికొచ్చేసరికి అమ్మాయి ఒక్కర్తె చూస్తూ వుంటుంది. సడన్‌గా కొత్త జంట లైట్లు ఆర్పేస్తుంది. పద్నాలుగేళ్ళమ్మాయి తనను తాను చూసుకుంటుంది. ఒంటిమీద దుస్తులు మాయమయ్యాయి. పదహారేళ్ళ బాయ్‌ఫ్రెండ్ ఏమయ్యాడు? తన పాదాల దగ్గరే వున్నాడు - దట్సాల్"

అలా చెప్పానో లేదో, బాబాయ్ వెర్రి కేక పెట్టి నన్ను అమాంతం పైకెత్తేశాడు. ఘోస్ట్‌లంతా ప్రశంసలలో ముంచెత్తాశారు. ఈలోగా -

"లెటర్స్ కూడా ఆన్సర్ చెయ్యగలరా మైడియర్ యంగ్ రైటర్ గారూ?" అంది బాబ్డ్ హెయిర్ అమ్మాయి ముచ్చటగా.

"ఓయస్ అడగండి?" అన్నాను మొండి ధైర్యంతో

"మీ దృష్టిలో రచయిత ఎలా వుండాలి?" అడిగిందామె.

"సజ్జనుడిలా వుండాలి" చెప్పాన్నేను.

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. సమాధానం తుస్సుమందనే వాళ్ళ భావన. "సజ్జనుడంటే ఎవరనుకొన్నారు? సజ్జలు తిని సజ్జలు విసర్జించు వాడు" అన్నాను. అందరూ గొల్లుమన్నారు. మా బాబాయి నవ్వు ఆపుకోలేక ఇంగ్లీషు నవలల దొంతరల మధ్యలో తలదూర్చేశాడు.

మా బాబాయ్ నిజంగా సజ్జనుడే. మరో గదిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని ... నేను మేడగదిలో ఏం జరుగుతుందో తెలుసుకున్నాను. ఆ తర్వాత మళ్ళీ మా యింటికి వెళ్ళితే ఒట్టు.

కాకపోతే పిన్ని మాత్రం నా గురించి వచ్చిన వాళ్ళతో కూడా "అదుగో ఆ మేడ మీద వచ్చాడు" అంటూంటుంది. సజ్జనులు అలాంటివి పట్టించుకోకూడదు కదా!

